

రవిప్రసాద్ సేవలు మరువలేనివి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ జీఎం(మార్కెటింగ్)గా పనిచేస్తూ ఈ నెలలో రిటైర్ కానున్న రవిప్రసాద్ సేవలు మరువలేనివని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన శ్రీరాంపూర్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరిం చారు. ఆయన సంస్థకు అనేక హోదాల్లో సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేష్, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, ఉత్తేజ్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గర్మిళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని విశ్వనాథ దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గోవర్ధన చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ముక్త రవి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జోరుగా సారా తయారీ
- మారుమూల ప్రాంతాల్లో అడ్డాలు
- అధికారులు దాడులు చేస్తున్నా మారని తీరు 6

నిధులు రాక.. నిర్వహణ భారం...
- రెండేళ్లుగా రైతు వేదికలకు అందని నిధులు
- అవస్థలు పడుతున్న ఏఈవోలు... పట్టించుకోని ప్రభుత్వం 7



కాజువే వంతెన కూలిన చోట బోల్తాపడ్డ లారీ (ఫైల్)

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- రూ. 13.50 కోట్ల టీఎఫ్ఐడీసీ నిధులు కేటాయింపు
- ప్రజల కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ
- ఏడాది క్రితమే భూమిపూజ
- ఇప్పటికీ ప్రారంభంకాని రాళ్లవాగు వంతెన నిర్మాణ పనులు

మంచిర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాళ్లవాగుపై హై లెవల్ వంతెన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఉన్న కాజువే బ్రిడ్జి స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 10 మార్చి 2024న భూమి భూమిపూజ చేశారు. దీంతో ఇంతకాలం ఇబ్బందులు పడుతున్న రంగంపేట, పవర్ హౌజ్ కాలనీ, అండాళమ్మ కాలనీల ప్రజల కష్టాలు తీరేందుకు మార్గం సుగమం అయింది. అయితే భూమి పూజ చేసి దాదాపుగా ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు కాంట్రాక్టింగ్, ఇతర పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరడంలేదు.

రూ. 80 లక్షలతో వంతెన నిర్మాణం...

పట్టణంలోని లక్ష్మీటాకీస్ ప్రాంతాన్ని, పాత మంచిర్యాల సమీపంలోని రంగంపేటను కలిపేందుకు 2005లో సుమారు రూ. 80 లక్షల అంచనా వ్యయంతో రాళ్లవాగుపై పైపులతో కూడిన కాజ్‌వే వంతెన నిర్మించారు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ అమరుల స్థూపం నుంచి వంతెన మీదుగా ప్రజలు ఆయా ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తారు. అంతకు ముందు వంతెన లేని సమయంలో ఆ ప్రాంత ప్రజలు పట్టణానికి రావాలంటే పాత మంచిర్యాల మీదుగానో, అండాళమ్మ కాలనీ మీదుగా ఎంసీసీ క్వారీ రోడ్డులో ఐదారు కిలో మీటర్లు ప్రయాణించేవారు. దీంతో ప్రజలకు దూర భారం పెరగడంతోపాటు అధిక వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. కాజువే వంతెన నిర్మాణం తరువాత కేవలం అర కిలోమీటర్ ప్రయాణించి పట్టణానికి చేరుకుంటున్నారు. పాలు విక్రయిస్తూ జీవనం సాగించే రంగంపేట ప్రజలు ఈ వంతెన గుండానే ప్రయాణిస్తారు. అలాగే పాఠశాలలు నడిచే సమయంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రాళ్లపేట, బైపాస్ రోడ్డు ప్రాంతంలోని ప్రజలు ఇప్పటికీ కాజువే వంతెన గుండానే ప్రయాణిస్తూ పాత మంచిర్యాల మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తారు. అయితే ప్రతియేటా వర్షాకాలంలో వరద ముంపు కారణంగా వంతెన కోతకు గురవుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

కుప్పకూలిన వంతెన...

రాళ్లవాగుపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే 2019లో కురిసిన భారీ వర్షాల కారణంగా కుప్పకూలిపోయింది. దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ప్రజా ప్రతినిధులుగానీ, మున్సిపల్ పాలక వర్గం గానీ ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదు. కూలిన చోట తాత్కాలికంగా మట్టిపోసి రాకపోకలను పునరుద్ధరించేవారు. దీంతో ప్రతి యేటా వర్షాకాలంలో రాళ్లవాగు ఉప్పొంగినప్పుడల్లా వంతెన నీట మునిగి మట్టి కొట్టుకుపోవడం, తరువాత యథాతదంగా తాత్కాలిక చర్యలు చేపట్టడం ఆనవాయితీగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు కాజువేపై రాకపోకలు సాగించే వారు భయభ్రాంతులకు గురయ్యేవారు. కాజువే వంతెన నిర్మాణానికి ముందు అదే ప్రాంతంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదన ఉండేది. అయితే 2005కు పూర్వం ఆ ప్రాంతం పెద్దగా అభివృద్ధి చెందకపోవడంతో...



నూతన వంతెనకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు (ఫైల్)

(తరువాయి 7లో)

పత్తి కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుంది

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పత్తి కొనుగోలు పూర్తయ్యేంత వరకు ప్రక్రియ కొన సాగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధార్ వెరిఫికేషన్‌లో ఓటీపీ ప్రక్రియలో సర్వర్ డౌన్ ఉన్న కారణంగా పత్తికొనుగోళ్లు నిలిపివేశామని, ప్రస్తుతం సర్వర్ రీస్టోర్ ప్లానింగ్ ప్రక్రియ కొనసాగు తుందన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా టోకెన్ పద్ధతిన పత్తి కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలి

లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 2020లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ నెల 28లోగా దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సీసీ కెమెరాల ముసుగులో వ్యాపారం

- రూ. 11.75 లక్షల విలువైన 23.5 కిలోల గంజాయి పట్టివేత
- జిల్లా కేంద్రంలో ఘటన

మంచిర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల అమ్మకాల ముసుగులో గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు చిక్కిన సంఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. ఈ ఘటనలో ఏకంగా రూ. 11.75 లక్షల విలువైన 23.5 కిలోల గంజాయి పట్టుపడగా, 22 మందిపై కేసు నమోదైంది. ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో 11 మంది పరారీలో ఉన్నారు. జిల్లా కేంద్రం లోని ఐబీ చౌరస్తా సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాంప్లెక్ సెల్లార్‌లో కొంతకాలంగా గంజాయి వ్యాపారం జరుగుతున్నట్లు పోలీసులకు ఉప్పం దింది. సోమ ప్రవీణ్ అనే వ్యక్తి వైఇన్ఫో సొల్యూషన్స్ పేరుతో సీసీ కెమెరాల వ్యాపారం చేస్తున్నాడు. దాంతోపాటు గుట్టు చప్పుడు కాకుండా అందులోనే గంజాయి దందా కూడా చేస్తున్నాడు. ఆంధ్ర ప్రాంతంలోని సీలేరు నుంచి గంజాయి తీసుకు వస్తున్న సోమ ప్రవీణ్, అతని ముఠా ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు. జనవరి మొదటి వారంలో అందరూ కలిసి కారులో సీలేరు వెళ్లారు. అక్కడి నుంచి సరుకును కారులో ఎస్కార్ట్ సహాయంతో మంచిర్యాలకు తరలించారు. అది విజయవంతం కావడంతో మళ్లీ ఫిబ్రవరి ఒకటిన సీలేరు నుంచే సరుకు తీసుకున్న ముఠా సభ్యులు కారులో మంచిర్యాలకు తీసుకువ చ్చారు. ఆ గంజాయిని సోమ ప్రవీణ్ సీసీ కెమెరాల గోదాంలో దాచి ఉంచారు. అందులో నుంచి కొందరు సుమారు 20 కిలోల మేర అమ్మకం కోసం తీసుకెళ్ల గా పోలీసులకు సమాచారం అందించింది. దీంతో గో దాంపై దాడిచేసి అక్కడ ఉన్న గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని తూకం వేయడానికి ఉపయోగించే ఎలక్ట్రానిక్ కాంటా, సెల్‌ఫోన్, మోటార్ సైకి ళ్లతో పాటు ముఠా సభ్యులను బుధవారం అదుపులోకి తీసుకోగా, మిగతా వారు పరారీలో ఉన్నారు.



శ్రీరాంపూర్‌వద్ద గంజాయి లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ (ఫైల్)

చాపకింద నీరులా వినియోగం....

గంజాయి వినియోగం జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. మహారాష్ట్ర, ఆంధ్రా, వరంగల్, తదితర ప్రాంతాల నుంచి మంచిర్యాలకు గంజాయిని తరలిస్తున్న వ్యాపారులు దాన్ని ఇక్కడి ఏజెంట్లకు విక్రయిస్తున్నారు. ఏజెంట్లు ప్యాకెట్ల రూపంలోకి మార్చి వివిధ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. గతంలో జైపూర్ మండల కేంద్రంలో పోలీసుల దాడుల్లో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఏడాదిన్నర క్రితం మంచిర్యాల బస్టాండులోనూ ఓ మహిళ వద్ద పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా రోడ్డు మార్గంలోనూ పెద్ద మొత్తంలో గంజాయి జి ల్లాకు చేరుతోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రోడ్డు మార్గంలో గంజాయిని తరలిస్తున్న ట్రాక్టర్ 2023 సెప్టెంబరు 22న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద బోల్తా పడింది. ట్రాక్టర్‌ను అక్కడే వదిలి స్మగ్లర్లు పరారు కాగా, రెండు రోజుల అనంతరం ట్రాక్టర్‌ను పరిశీలించిన పోలీసులకు అందులో లభించిన పత్రాల ఆధారంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలిమెల నుంచి వచ్చినట్లు నిర్ధారించారు.

విద్యార్థులు, యువతే లక్ష్యంగా...

జిల్లాకు సరఫరా అవుతున్న గంజాయి యువత, కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు జరుగుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం బెల్లంపల్లిలో ని పాలిటెక్నిక్ కళాశాలలో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఆరుగురు విద్యార్థులను ప్రిన్సి పాల్ సస్పెండ్ చేశారు. మంచిర్యాలకు చెందిన ఓ వ్యక్తి కళాశాలలోని విద్యార్థులకు గంజాయి అంద జేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

మందమర్రిటౌన్/మందమర్రి రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసమే పుట్టిన పార్టీ సీపీఐ అని, పాలక వర్గ విధానాలపై ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులు సాధించి పెట్టింది కూడా తమ పార్టీనేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా అధ్యక్షుడు రామడుగు లక్ష్మణ్ తెలిపారు. గురువారం పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణాపూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. ప్రజల సమస్యల సాధన కోసం తమ పార్టీ సమరశీల పోరాటాలు చేస్తుందని చెప్పారు. పీడిత ప్రజలకు అండగా ఉన్నది తమ పార్టీనేనన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల కనీస హక్కుల కోసం పోరాడి ఎంతో మంది నాయకులు అమరులయ్యారని తెలిపారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాలను ఎప్పుడు ఎండగడుతుందన్నారు. తమ పార్టీ ఆవిర్భ వించి వంద సంవత్సరాలు పూర్తయిన సంద ర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా పార్టీ చేసిన పోరాటాలను వివరి స్తామన్నారు. దేశంలో పాలకవర్గాలను ప్రశ్నించే పార్టీ ఏదైనా ఉందంటే అది సీపీఐ అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టన నాయకులు మిట్టపల్లి పౌలు, శ్రీనివాస్‌తో పాటు గాండ్ల సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలవేన శంకర్

సన్నరకం ధాన్యం బోనస్ చెల్లించాలంటూ నిరసన



దండేపల్లి తాసీల్దార్ కార్యాలయం వద్ద ధాన్యం బోనస్ కోసం ఆందోళన చేస్తున్న రైతులు

దండేపల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): సన్నరకం వరిధాన్యం అమ్మిన రైతులకు బోనస్ రూ. 500 రైతుల ఖాతాలో జమచేయాలని కోరుతూ దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఇప్పటికీ ఖాతాలో పడలేదన్నారు. రైతు భరోసాతో పాటు బోనస్‌ను వెంటనే అర్హులందరి ఖాతాలో జమ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సంధ్యరాణిని కలిసి బోనస్ డబ్బుల కోసం రైతులు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పలు మండలాల రైతులు పాల్గొన్నారు.

చెన్నూరులో పట్టభద్రుల సమావేశం

- ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఎమ్మెల్యే వివేక్
- తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28న రాష్ట్రంలో జరగనున్న ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం చెన్నూరు నియోజకవర్గంలో పట్టభద్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం ఆయన మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి నరేందర్‌రెడ్డిని పార్టీ ప్రకటించడంతో దాదాపు విజయం ఖాయమయిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్యకు కృషి చేసిన పేరు ఆయనకు ఉందని పేర్కొన్నారు. పార్టీ కూడా అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి టికెట్ కేటాయించడం జరిగిందని తెలిపారు. పార్టీకి సంబంధించి ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు కూడా నరేందర్ రెడ్డి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 8 వేలకు పైగా పట్టభద్రులు ఉన్నారని, జిల్లాలో 30 వేలకు పైగా ఉన్నారని తెలిపారు. పట్టభద్రులంతా విజ్ఞతతో ఆలోచించి విజయం కట్టబెడతారని ఆయన పేర్కొన్నారు. రేపటి నుంచి జిల్లాలో ప్రచారం పెద్ద ఎత్తున ప్రారంభించ బోతున్నామని ఆయన పేర్కొన్నారు.

ఎర్ర చెరువును అభివృద్ధి చేయాలి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని ఆదిల్‌పేటలోని ఎర్ర చెరువును ప్రభుత్వం అభివృద్ధి చేయాలని బహుజన సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఇరిగేషన్ అధికారి శారదకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎర్ర చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం గతంలో కొనుగోలు చేసిన భూమిని గుర్తించి ట్రెంచు ఏర్పాటు చేయాలని, చెరువు ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం



మాట్లాడుతున్న పీడీ రౌఫ్‌ఖాన్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు వేదికలో లక్షెట్టిపేట మాత శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మూడు మండలాలకు చెందిన దివ్యాంగులకు సహాయక ఉపకరణాల పంపిణీ ఎంపిక శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రౌఫ్‌ఖాన్ హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సౌకర్యార్థం అలీవ్ కంపని సహకారంతో పరికరాలను, అదే విధంగా చేతికర్రలు, సంక కర్రలు, చెవి మిషన్లు, ట్రైసైకిళ్లను, ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లను అందజేసేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం దరకాస్తులను తీసుకుంటున్నామన్నారు. మూడు మండలాల నుంచి సుమారు 440మంది దివ్యాంగులు పాల్గొని వివిధ పరికరాల కోసం దరకాస్తు చేసుకున్నట్లు వాటిని పరిశీలించి త్వరలోనే సహాయక ఉపకరణాలను అందజేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సీడీపీవో రేష్మా, మున్సిపల్ కమీషనర్ మారుతిప్రసాద్, సూపర్‌వైజర్ మమతతో పాటు మూడు మండలాల ఎంపీడీవోలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

●పట్టణంలోని రైతు వేదికలో గురువారం మాత శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపకరణాల ఎంపిక కార్యక్రమంలో శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమంలో సమితి సభ్యులు గంప రవీందర్, నగధర్, రమేష్, రాంసింగ్, మురళి, శ్రీనివాస్‌తో పాటు సమితి సభ్యులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న పండితులు

నస్పూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లో జరుగుతున్న విశ్వ శాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా గురువారం లక్ష్మీ కుబేర సహిత అష్టలక్ష్మి హోమం, దశ సహస్ర లింగార్చన, జ్వాలాదీపోత్సవం, శ్రీ లక్ష్మీనృ సింహ కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగాయి.. ఉదయం గోపూజ, తులసీ పూజ, శ్రీ రుద్ర సహిత మృత్యుంజయ హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. భక్తులు తరలివచ్చి యాగశాలల చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవతమూర్తులను దర్శిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బ్యారెక్‌లో ఈ నెల 22,23 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రంగు శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ జిల్లాలోని 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని, వీరందరికి భోజన సదుపాయం సమకూరుస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే క్రీడల్లో గెలుపొందిన వారికి ముగింపు రోజు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్నామని, ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ఏసీపీకి వినతి

జైపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా జరిగే వేలాల జాతరకు పౌనూరు, శివ్వారం, వేలాల గ్రామస్తులకు ఎలాంటి రుసుము లేకుండా అనుమతులు ఇవ్వాలని గురువారం బీఆర్ఎస్ నాయకులు అర్నె సమ్మయ్య, యేసయ్య ఏసీపీ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఏసీపీ స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: పారిశుధ్యం మెరుగుదలకు గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆ గ్రా మ పంచాయతీలో ఉన్న కార్యదర్శులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి పల్లెలు పరిశు భ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. చెత్తాచెదారం పేరుకుపోకుండా తొలగించేలా సూచనలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులకు అందజేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులకే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాకే జాబితాలో పేరు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఇటీవల గ్రామసభల్లో జాబితాలో పేర్లులేని వారు ఆందోళన చెందుతున్నారు. వీరి కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: జాబితాలో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హత ఉంటే తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాం.

- చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి)

జోరుగా సారా తయారీ

- మారుమూల ప్రాంతాల్లో అడ్డాలు
- అధికారులు దాడులు చేస్తున్నా మారని తీరు



నిల్వ చేసిన బెల్లం పానకాన్ని వెలికి తీస్తున్న పోలీసులు(ఫైల్)

తిర్యాణి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో నాటు సారా తయారీ జోరుగా సాగుతోంది. అటవీ, మారుమూల ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కుటీర పరిశ్రమలా వ్యాపారం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నా నాటుసారా తయారీదారులు ఏమాత్రం తగ్గడం లేదు. తిర్యాణి మండలంలో 80 శాతంపైగా పల్లెలు అటవీ ప్రాంతాల్లో ఉండడం అక్రమార్కులకు అనుకూలంగా మారింది. వాగును అనుకుని ఉండే అటవీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని గుట్టు చట్టుప్పుడు కాకుండా గుడుంబా స్థావరాలను ఏర్పాటు చేసుకుని అక్రమ దందా కొనసాగిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో తయారు చేసిన నాటు సారాను జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అటు పోలీసు సిబ్బంది, ఇటు అబ్కారీ శాఖ సిబ్బంది దాడులు నిర్వహిస్తున్నా దందా మాత్రం ఆగడం లేదు. గత నెల 22న మండలంలోని మాణిక్యాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేసి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గంభీరావుపేట గ్రామలో ఇటీవల నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో సైతం నాటుసారా లభ్యమవడం దందా నడస్తున్న తీరుకు అద్దం పడుతోంది.

● తరలించి విక్రయం

నాటుసారా ఎక్కువగా అటవీ, కొండ ప్రాంతాల్లో తయారవుతోంది. దీన్ని గుట్టు చప్పుడు కాకుండా మైదాన ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. కాసిన నాటుసారాను ప్లాస్టిక్ క్యాన్లలో పోసుకుని అటవీ మార్గాల ద్వారా ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఐదు నుంచి పది మంది విక్రయదారులకు బెల్టుషాపుల మాదిరి లీటరుకు రూ.100 చొప్పున తీసుకుంటూ డోర్ డెలవరీ చేస్తున్నారు. దీంతో దాదాపు అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా నాటుసారా లభ్యమవుతోంది. మద్యం ధరతో పోల్చితే గుడుంబా చవక కావడంతో మందుబాబులు నాటుసారా సేవిస్తున్నారు. కాగా నాటుసారా తయారీ లో హానికరమైన పటికతో పాటు మత్తునిచ్చే రసాయనాలు వినియోగిస్తున్నారు. నల్లబెల్లం మిశ్రమాన్ని డ్రమ్ములో కలిపి ఊటను తయారు చేస్తారు. దాన్ని 10రోజులు ఇలానే ఉంచుతారు. తర్వాత బెల్లం ఊటను కుండలో పోసి మంట పెడుతారు. బెల్లం ఊట మరిగి వచ్చిన ఆవిరి చుక్కలు పైపు ద్వారా బయటకు వచ్చేలా ఏర్పాటు చేస్తారు. అలా వచ్చిన ఆవిరి చుక్కలే నాటుసారా. ఇలా తయారు చేసిన నాటుసారా తాగిన వారు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా నాటు సారా తయారీని అక్రమార్కులు కొనసాగిస్తున్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై(ఫైల్)



పోలీసులు పట్టుకున్న బెల్లం పానకం(ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం..



నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే నిబం ధనల మేరకు పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. ఎక్కడైనా గుడుంబా తయారీ, విక్రయాలు కొనసాగుతున్నా ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజలు కూడా నాటుసారా తాగొద్దు. దీని వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడుతారు.

- శ్రీకాంత్, ఎస్సై, తిర్యాణి

అక్రమ వసూళ్లపై ఏసీబీ విచారణ

నెన్నెల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నెన్నెల ఏఈఈ మిట్టపల్లి మల్లయ్య అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు రైతులు చేసిన ఫిర్యాదుపై ఏసీబీ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. 2024 జూన్‌లో గొళ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి ట్రాన్స్‌ఫార్ల ఏర్పాటు కోసం ఏఈఈ డబ్బులు వసూలు చేశారని, డీడీలు కట్టినప్పటికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయక పోవడంతో పంటలు ఎండిపోయాయని బాధిత రైతులు ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి ఫిర్యాదు చేశారు. ఖర్చులకు డబ్బులు కావాలని డిమాండ్ చేసి కొందరు రైతుల నుంచి వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చినప్పటికీ పనులు చేయకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నాడని ఫిర్యాదు చేశారు. సీఎండీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు అప్పట్లో ప్రాథమిక విచారణ చేపట్టి మల్లయ్యను సస్పెండ్ చేశారు. ఆర్థికపరమైన లావాదేవీలు జరగడంతో ఈ కేసును ఏసీబీకి అప్పగించారు. ఏసీబీ ఎస్సై కిరణ్‌రెడ్డి సిబ్బందితో గురువారం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధిత రైతులతో మాట్లాడారు. ఏఈఈకి ఎవరెవరు ఎన్నెన్ని డబ్బులు ఇచ్చారు.. నగదు ఇచ్చారా.. యూపీఐ ద్వారా చెల్లించారా తదితర విషయాలను తెలుసుకొని ఆధారాలను సేకరించారు. నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఎస్సై పేర్కొన్నారు.

పంజా విసిరిన పెద్దపులి

- దాంపూర్ అడవుల్లో గేదె దూడపై దాడి

భీమారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలంలోని దాంపూర్ అడవిలో బుధవారం సాయంత్రం పెద్దపులి గేదె దూడపై దాడి చేసి హతమార్చిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే పశువుల మందతో దాంపూర్ అడవి పరివాహక ప్రాంతంలో గేదెల మందులు మేస్తుండగా పెద్దపులి గ్రామానికిచెందిన మేకల బాపు అనే రైతు గేదె దూడపై దాడి చేసి చంపింది. బాపు గేదె దూడ తిరిగి రాకపోవడంతో పశువుల కాపరి వద్దకు వెళ్లి విచారణ చేయగా మంద ఒకసారి సాయంత్రం భయపడి పరుగులు తీయగా తాను సైతం వాటి వెంట కొంత దూరం వరకు వచ్చానని చెప్పాడు. రాత్రి కావడంతో దూడ రాకపోవడంతో గురువారం ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్‌లతో పాటు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. గేదె దూడను పెద్దపులి దాడి చేసిందని నిర్ధారించారు. ఈ విషయంపై ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా భీమారం అడవుల్లో పెద్దపులి సంచరిస్తోందని, ఇప్పటికే రైతులకు, పశువుల కాపరులకు సమాచారం ఇచ్చామన్నారు. అడవిలోకి వెళ్లవద్దని సూచించినట్లు తెలిపారు. మేకల బాపు దూడపై పెద్దపులి దాడి చేసి చంపిందని ఉన్నతాధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

ఆలయంలో చోరీ

రెబ్బెన, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్ శివారులోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు హుండీ పగుల కొట్టి అందులోని నగదును ఎత్తుకు పోయారని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ ఈవో బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు సీఐ బుద్ధ స్వామితో పాటు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గంజాయి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

- సీసీ కెమెరాల అమ్మకాల ముసుగులో దందా
- ఈ కామర్స్ ఏజెన్సీల ద్వారా డెలివరీ
- ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 96.7కిలోల గంజాయి పట్టివేత
- రెండు కేసుల్లో 1.2 క్వింటాళ్లు స్వాధీనం
- విలువ రూ.60 లక్షలు, రెండు కేసుల్లో 15మంది అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో రామగుండం కమిషరేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాయి. పకడ్బందీ సమాచారంతో ఒకే రోజు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో దాడులు నిర్వహించి 1.2 క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. 15 మంది నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఐదు మోటార్ సైకిళ్లు, 17సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం కమిషరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ శ్రీనివాస్ అరెస్టు వివరాలను వెల్లడించారు. మంచిర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ సెల్లార్‌లో సోమ ప్రవీణ్ సీసీ కెమెరాల షాపు పేర గంజాయి అమ్మకాలు చేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు దందాను గుట్టు రట్టు చేశారు. సోమ ప్రవీణ్, అతని స్నేహితుడు సతీష్, మరికొందరు సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి సీసీ కెమెరాల గోడౌన్‌లో నిల్వ చేసేవారు. అనుమానం రాకుండా ప్యాక్ చేసి ఈ కామర్స్ డెలివరీ ఏజెన్సీల ద్వారా కస్టమర్లకు పార్శిళ్ల రూపంలో చేరవేసేవారు. అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దీనిపై నిఘా పెట్టారు. గురువారం గోడౌన్‌పై టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. బాల నేరస్థుడితో పాటు 11మందిని అరెస్టు చేయగా మరో 11మంది పరారీలో ఉన్నారు. అప్పటికే సోమ ప్రవీణ్, రాజు అనే వ్యక్తులు బయటకు వెళ్లగా ఇరుగురాళ్ల సతీష్ కుమార్(34), మహ్మద్ సమీర్(19), భీమ అనుదీప్(21), మహ్మద్ అబ్దుల్ ఉబేద్(22), అర్జున్ బాబురావు చౌహాన్(26), మహ్మద్ అజీజ్(19), జాడి రాఘవేంద్రస్వామి (23), గూడూరు రాము(20), ఎస్‌కే అతహ ర్(18), ఎస్‌కే సమీర్(25)లను పట్టుకున్నారు. ప్రధాన సూత్రదారి సోమ ప్రవీణ్, తగరపు రాజు, అతని భార్య శృతి, తరగపు వినయ్, రామారపు రాకేష్, శ్రీధర్, మున్ని, అల్ మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సోహెల్, చింటు పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి 23.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11ఫోన్లు, ఐదు బైక్‌లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు సీజ్ చేశారు.

గోదావరిఖని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11ఏ క్రాస్ వద్ద గురువారం ఛత్తీస్‌గడ్ నుంచి గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టుటౌన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రకు వెళుతున్న రెండు కార్లను తనిఖీ చేయగా కారు డిక్కి కింది భాగంలో ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటు చేసి రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. 96.7కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉదయ్ వీర్(32), ఒడిశాకు చెందిన కేశవ్ కర, సోమనాథ్ కర, రాజస్థాన్‌కు చెందిన రాజు లోధి సంజు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ నలుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరజ్, అర్జున్ బోరిలు పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 1.2 క్వింటాళ్ల గంజాయి విలువ మార్కెట్‌లో రూ.60 లక్షలు ఉంటుందని సీపీ శ్రీనివాస్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పట్టుబడిన నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడమే కాకుండా, వారి ఆస్తులను జప్తు చేస్తామని సీపీ హెచ్చరించారు. గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, మంచిర్యాల, గోదావరిఖని టుటౌన్ పోలీసులను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్లు సీజ్

తాండూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ చెరువులో అక్రమంగా మట్టిని చేరవేస్తున్న ఒక ఎక్స్‌కావేటర్, ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి తాండూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎజాజుద్దీన్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రేచిని గ్రామ శివారులోని ప్రభుత్వ చెరువులో మట్టిని తీ స్తున్నారనే సమాచారం మేరకు వెళ్లి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది మహేందర్, దిగంబర్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నెన్నెల మండలం గుండ్ల సోమారం నుంచి బెల్లంపల్లి మండలంలోని పెర్కఎల్లికి గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేష్ తెలిపారు. సమాచారం మేరకు ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసి డ్రైవర్లు కుమార్, విశ్వనాథ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అటవీ అధికారులు తిట్టారని.. గిరిజనుడి ఆత్మహత్యాయత్నం

జన్నారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అటవీ అధికారులు తిట్టారని జన్నారం మండలంలోని దేవునిగూడ గ్రామపంచాయతీలోని గడ్డంగూడకు చెందిన గిరిజనుడు తుకారం పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం గడ్డంగూడలో గిరిజనులు వేసుకున్న గుడిసెలను ఫారెస్టు అధికారులు తొలగించారని తెలిపారు. అయినా అదే స్థలంలో ఉన్న తమ వద్దకు గురువారం ఉదయం ఫారెస్టు అధికారులు మరోసారి వెళ్లి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని దుర్భాషలాడారని వాపోయాడు. మనోవేదనకు గురైన తుకారం పురుగుల మందు తాగాడు. దీంతో గిరిజనులందరూ కలిసి జన్నారంలోని అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేశారు. అనంతరం తుకారాంను చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పించిన వ్యక్తి రిమాండ్

కాసిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన కోవెల శ్రావణ్ తప్పుడు అఫిడవిట్ సమర్పించిన కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ శ్రావణ్ తనపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ సమర్పించి పోలీసుల వెరిఫికేషన్‌ను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశాడు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారణ చేయగా శ్రావణ్‌పై చెక్‌బౌన్స్ కేసు ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో పోలీసులకు తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా తప్పుడు ధ్రువపత్రాలు చూపి ఏదైనా సర్టిఫికెట్‌లు పొందాలని చూస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విధులు నిర్వహించే ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు సంభవిస్తాయని ఎలక్ట్రికల్ డీఎంఎస్ విశ్వనాథ్‌బెహరా తెలిపారు. గురువారం స్థానిక స్థానిక ఎల్లందు క్లబ్‌లో నిర్వహించిన మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాల వర్క్‌మెన్ ఇన్స్‌స్పెక్టర్లకు భద్రత, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో రక్షణకు సంబంధించి ప్రణాళిక, ప్లాన్‌లను అనుసరించడంతో పాటు అమలు చేసుకోవడం మంచిదన్నారు. భద్రత సూత్రాలను పాటిస్తూ పని చేయడం ప్రతి ఒక్కరూ విధిగా భావించాలన్నారు. రోజు వారి రక్షణ సూత్రాలను పాటిస్తూ ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. ప్రమాదాల నివారణకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో రక్షణకే యాజమాన్యం పెద్దపీట వేస్తుందని తెలిపారు. అంతకు ముందు నూతనంగా నియమితులైన పీపీ వెంకటేశ్వర్లుతో పాటు హాజరైన డీఎంఎస్ విశ్వనాథ్ బెహరానులకు పుష్పగుచ్ఛం ఇచ్చి మందమర్రి జీఎం దేవేందర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జీఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘుకుమార్, బెల్లంపల్లి జీఎం నరేందర్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, గుర్తింపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు కె ప్రేంకుమార్, డీడీఎంఎస్ మైనింగ్ హైదరాబాద్ దిలీప్‌కుమార్, ఎస్‌వోటూ జీఎం విజయ ప్రసాద్, ఏరియా రక్షణాధికారి రవిందర్, బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారా యణ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

కాగిత రహిత సేవలకు శ్రీకారం




మాట్లాడుతున్న ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు

జైపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిశ్రమల్లో నూతన సాంకేతికతతో కాగిత రహిత సేవలకు శ్రీకారం చుడుతున్నామని ఎస్టీపీపీ ఈడీ రాజశే ఖర్‌రావు అన్నారు. గురువారం ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులకు, ఉద్యోగులకు ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ చాల ముఖ్యమైందని, ఇప్పటికే చాల రాష్ట్రాల్లో ప్రభుత్వాలు , ప్రైవేటు సంస్థలు టెక్నాలజీని వినియోగిస్తున్నా యన్నారు. సింగరేణిలో సాప్‌ను ఉపయోగించుకుని చాలా వరకు పనులను సులభతరం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేనేజ్‌మెంట్ ద్వారా కాగితం వినియోగం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో దీన్ని పూర్తిగా అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు శ్రీనివాసులు, మహేందర్, మధుసూదన్‌రెడ్డి, ఆజాదుల్లాఖాన్, వేణుగోపాల్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, పంతుల, మహేందర్, వెంకటయ్య, మోహన్ సింగ్‌టాకూర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కార్యాలయంలో జీఎం(మార్కెటింగ్) గా పనిచేస్తూ ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న రవి ప్రసాద్ సంస్థ అభివృద్ధికి కృషి చేశారని జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. అనంతరం ఏరియా జీఎం మాట్లాడుతూ, రవి ప్రసాద్ సింగరేణిలో అనేక హోదాలలో పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. సేవలు అభినందనీయమని తెలి పారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం ఎస్. సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరి యా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీ ఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీఓ ఏవీరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.



ఏరియా జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం శ్రీనివాస్‌ను బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మా నించారు. ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి జీఎంకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, నాయకులు జిల్లా తిరుపతి, కుంట రాజు, కుమ్మరి చంద్రశేఖర్, బుర్ర అరుణ్‌గౌడ్, బూక్య కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

'జనక్‌ప్రసాద్ ఆరోపణలు అవాస్తవం'

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తమ యూనియన్ బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డిపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఏబీకేఎంఎస్(బీఎంఎస్) కార్యదర్శి పి. మాధవనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ నిధులు 727 కోట్ల రూపాయలను డీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో పెట్టుబడిగా పెట్టిన తరువాత ఆ సంస్థ దివాళా తీసిందని పేర్కొన్నారు. ఆ నిధులు తిరిగి సీఎంపీఎఫ్‌కు రాకపోవడంపై సీబీఐ విచారణ చేపట్టాలని తాము మొదటినుంచి కోరుతున్నామని తెలిపారు.

చెరువులో మట్టిని తొలగించాలి



జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్‌లోని ఓపెన్‌కాస్టు సమీపంలో గల అమరవాది చెరువులో మట్టిని తొలగించాలని, తమ జీవనోపాదిని కాపాడాలని మందమర్రి జీఎం దేవేందర్‌కు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు నూనె శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఓసీలోని మట్టి అంతా చెరువులోకి చేరి చేపలు ఎదుగుదల లేకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని చెప్పారు. . జీఎం స్పందించి త్వరలో మట్టి తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



నిర్లక్ష్యం వీడాలి

తాండూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రికార్డుల నిమోదు నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రతి రికార్డును ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

గర్మిళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఒకేషనల్ జూనియర్ కళాశాల శ్రీసాయి పారామెడికల్ ఫేర్‌వెల్‌డే వేడుకలను గురువారం స్థానిక హరిత ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, రమ్యశ్రీ, శైలజ, స్వప్న, కళాశాల డైరెక్టర్‌లు ఆదిత్యబాబు, సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.





కమిషనర్‌కు వినతి

గర్మిళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 5వ వార్డులో కుక్కల బెడద తొలగించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్‌కు మాజీమున్సిపల్ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, వార్డుప్రజలు వినతి పత్రం అందించారు. విద్యార్థులను, పనులకు వెళ్లే వారిని కుక్కలు వెంట పడి కరుస్తున్నాయని, యన్నారు. సాయికుంట నుంచి గోదావరి నది వరకు వెళ్లే మార్గంలో ముళ్లపొదలు తొలగించాలని కోరారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

చెన్నూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో పట్టణానికి చెందిన కొంత మంది అక్రమార్కులు ఫోల్స్ వేయడంతో గురువారం తహసీల్దార్ మల్లికార్జున్ ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. 863 సర్వే నెంబరులో కొంత మంది సిమెంటు ఫోల్స్ వేసినట్లు జర్నలిస్టులు కలెక్టర్, తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సిమెంటు ఫోల్స్‌ను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.



మానవాళి మనుగడకు చెట్లు అవసరం

అత్తె సుభాష్, ఎఫ్ఆర్‌వో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): మానవాలి మనుగడకు చెట్లు చాలా అవసరం. ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని అడవులను రక్షించడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని లక్షెట్టిపేట అటవీ క్షేత్ర అధికారి అత్తె సుభాష్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు వివరాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి: అగ్ని ప్రమాదాల నుంచి అడవులను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి..?

ఎఫ్ఆర్వో: అటవీప్రాంతంలో రోడ్డుకు ఇరువైపుల 5మీటర్ల వెడల్పుతో ప్రమాదాలు నివారించేందుకు ఫైర్‌లైన్ తీస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: ఇప్పపువ్వు సేకరించేందుకు అనుమతులు ఇస్తున్నారా....?

ఎఫ్ఆర్వో: ఇప్పపువ్వు సేకరణకు ఎక్కువ మేరకు గిరిజనులు అడవిలోకి వెళ్తుంటారు. వాళ్లకు ఇప్పపువ్వు ఏరుకోవడం వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. చెట్లను వాటి కొమ్మలను నరకడం, పువ్వు కోసం చెట్ల కింద నిప్పు పెట్టవద్దని ముందుగానే చెబుతున్నాము.

ఆంధ్రజ్యోతి: ఇటీవల ఏర్పాటు చేసిన సఫారీపై మీ స్పందన...?

ఎఫ్ఆర్వో: మన ప్రాంతంలో సఫారీ ఏర్పాటు చేయడంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. జింకలు, అడవి దున్నలు, దుప్పులు, నెమలులతో పాటు మరికొన్ని వణ్యప్రాణులు నిత్యం సందర్శకులకు దర్శనం ఇవ్వడంతో సఫారీకి వచ్చిన వాళ్లు సంతోషిస్తున్నారు.

బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలోని నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారిన రైతు వేదిక



నిధులు రాక.. నిర్వహణ భారం..



రైతు వేదికలో తలుపులు లేక ఉపయోగంలో లేని మూత్రశాల

● అవస్థలు పడుతున్న ఏఈవోలు... పట్టించుకోని ప్రభుత్వం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే విధంగా రైతు వేదికల నిర్మాణాలను చేపట్టింది. రైతు వేదికల్లో రైతులకు సాగులో మెళకువలను తెలియజేస్తూ వ్యవసాయాధి కారులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిం చాలనే ఉద్దేశ్యంతో నిర్మించారు. వీటి నిర్వహణను ఏఈ వోలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. రెండేం డ్లుగా రైతు వేదికలకు ఎలాంటి నిధులు రాకపోవడం తో సంబంధిత ఏఈవోలు అవస్థలు పడుతున్నారు. ని ధులు రాక, నిర్వహణ లేక రైతు వేదికలు కళ తప్పుతు న్నాయి. జిల్లాలోని పలు రైతువేది కల చుట్టూ ప్రహరీ గోడలు లేకపోవడంతో మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కోతులు దూరి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి.

జిల్లాలో 55 రైతు వేదికలు

గత ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 55 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో రైతు వేదికను రూ. 22 లక్షల నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మొద ట్లో నిర్వహణకు రూ.3 వేలు చొప్పున అందజేసింది. ని ర్వహణకు నిధులు సరిపోకపోవడంతో ఏఈవోలు ప్ర భుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో 2020 ఏప్రిల్ నుంచి నెలకు రూ. 9 వేలు అందజేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రెండేండ్లుగా నిర్వహణకు నిధులు రాకపోవ డంతో ఈ భారమంతా ఏఈవోల మీద పడుతోంది. ఒ క్కో రైతు వేదికకు దాదాపు రూ. 2 లక్షలకు పైగా నిధు లు రావాల్సి ఉంది. ప్రతి నెల విద్యుత్ బిల్లు, పారిశుధ్య నిర్వహణ, స్టేషనరీ, తాగునీటి సదుపాయం తదితర సౌకర్యాలను ఏఈవోలు వారి సొంత ఖర్చులతో తీరుస్తున్నారు.

● నిర్వహణ లేక... అభివృద్ధికి నోచుకోక

జిల్లాలోని రైతు వేదికలకు రెండేండ్లుగా నిధులు రాకపోవడం, మరో వైపు అభివృద్ధికి నోచుకోవడం లేదు. రైతు వేదికలకు చుట్టూ ప్రహరీ లేకపోవడం, గ్రామాల శివారులో రైతు వేదికలు నిర్మించడంతో పలు రైతు వేదికలు మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. పరిసరాల్లో మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. కిటికీలకు, ముందు మార్గంలో తలుపులు లేకపోవడంతో కోతులు లోపలికి చొరబడి వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం న డుస్తుండడంతో రైతుల కోసం కొత్త కొత్త కార్యక్రమాలు అమలవుతున్నాయి. దీంతో నిర్వహణ వ్యయం మరింత పెరిగిందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క ల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కుల పంపిణీతో పాటు ప్రతి వారం రైతు నేస్తం కార్యక్రమాలను రైతు వేదికల్లో నిర్వహిస్తున్నారు. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నా రై తు వేదికల్లో ఏఈవోలను సంప్రదించాలి. ఇలా రైతు లకు, వ్యవసాయాధికారులకు అందుబాటులో ఉండేం దుకు నిర్మించిన రైతు వేదికలు నిధులు లేక అభివృద్ధి లేక వెలవెలబోతున్నాయి.

నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం

రైతు వేదికల నిర్వహణకు నిధులు రావడం లేదు. నిధులు, విద్యుత్ బిల్లుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. నిర్వహణ కోసం నిధులు రానప్పటికీ రైతు వేదికలను సక్రమంగా నిర్వహిస్తున్నాం.

- జిల్లా వ్యవసాయాధికారి కల్పన

నిర్వహణ ఇబ్బందిగా మారుతుంది

రైతు వేదికల నిర్వహణకు కొన్నేండ్లుగా నిధులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏఈవోలపై భారం పడుతుంది. ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణ కోసం పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేస్తే వ్యవసాయాధికారులకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం విద్యుత్ బిల్లుల చెల్లింపు, పారిశుధ్య నిర్వహణ, ఇతర ఖర్చులకు ఇబ్బంది ఎదురవుతుంది.

- ప్రేమ్‌కుమార్, వ్యవసాయాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో...?

(5వ పేజీ తరువాయి)

అప్పటి పాలకులు కాజువే వంతెనతో సరిపెట్టారు. కాల క్రమంలో రంగంపేట ప్రాంతం అభివృద్ధి చెందడం, సమీపంలో కొత్త కాలనీలు ఏర్పాటు కావడంతో ప్రజల సౌకర్యార్థం హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. పాలకులు సైతం హైలెవల్ బ్రిడ్జి ఆవశ్యకతపై అనేక సార్లు ప్రస్తావనకు తెచ్చారు. అయితే దశాబ్ధాలు గడిచినా వంతెన నిర్మాణం కేవలం ప్రతిపాదనలకే పరిమితం అయిందిగానీ ఆచరణలోకి రాలేదు.

రూ. 13.50 కోట్లతో శ్రీకారం...

ప్రజల విన్నపాల మేరకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక శ్రద్ధతో కాజువే స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ. 13.50 కోట్లతో హై లెవల్ వంతెన నిర్మాణానికి భూమిపూజ చేయడంతో మోక్షం లభించినట్లయింది. వంతెన నిర్మాణంతో అవతలి వైపు ఉన్న పాత మంచిర్యాల, రంగంపేట, పవర్ హౌజ్ కాలనీ, అండాళమ్మ కాలనీ ప్రజలకు రాకపోకలు సులభతరం కానుండగా, ఆయా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ అమరవీరుల స్థూపం మొదలుకొని వాగు అవతలివైపు సుమారు 200 మీటర్ల పొడవుతో వంతెన నిర్మాణం జరుగనుండగా, మొత్తంగా రూ. 20 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే కారణాలు ఏవైనప్పటికీ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి, భూమిపూజ కూడా చేసినందున ఆలస్యం చేయకుండా త్వరితగతిన కాంట్రాక్టింగ్ పూర్తిచేసి, నిర్మాణ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను ఇబ్బందులు పెడితే ఊరుకోం

మంత్రి సీతక్క

జన్నారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాత్రివేళల్లో ఫారెస్టు చెక్‌పోస్టుల వద్ద అనవసరంగా ఫారెస్టు అధికారులు ప్రజలను ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హెచ్చరించారు. కవ్వాల టైగర్ జోన్ పరిధిలో రాత్రి వేళల్లో చెక్ పోస్టుల వద్ద ఫారెస్టు అధికారులు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ కొందరు ఫారెస్టు అధికారులు ఎవరి మెప్పు పొందటానికో ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ఇప్పటికైనా వారి తీరు మార్చుకోవాలని లేకుంటే వదలి పెట్టమని హెచ్చరించారు.

షాట్‌పుట్‌లో సంపత్‌కు పతకం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో కోటపల్లి మండలం నాగంపేట గ్రామానికి చెందిన ఈర్ల సంపత్ కాంస్య పతకం సాధించాడని కోచ్ నల్వాల సంతోష్‌యాదవ్ గురువారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 19వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్శిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన షాట్‌ఫుట్‌లో సంపత్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. సంపత్‌ను జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మారయ్య, కోచ్ సంతోష్‌యాదవ్ అభినందించారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

జైపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం వేలాల జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జాతర కు ఇంకా వారం రోజులు గడువు ఉన్నందున పనులు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి అల్పాహారం అందించేలా చూడాలని సీఐ వేణుచందర్‌కు సూచించారు. ఎస్ఐ శ్రీధర్, నాగరాజు, కానిస్టేబుల్ మల్లయ్య ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

తాండూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లు ప్రారంభి స్తున్నట్లు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గురువారం తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ బెల్లంపల్లి పరిధిలోని తాండూర్ మండలం రేపల్లెవాడలో గల రెండు జిన్నింగు మిల్లుల్లో ఈ నెల 21 నుంచి సీసీఐ ద్వారా నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోళ్లు చేయనున్నట్లు తెలిపారు. అలాగే నూతనంగా టీఆర్‌లు చేయబడవని, రైతులు తప్పకుండా వేలిముద్ర వేస్తేనే పత్తి కొనుగోళ్లు చేస్తామన్నారు.


బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కోటపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు మండలంలోని అన్నారం, రాపనపల్లి, లక్ష్మీపూర్, దేవులవాడ, వెల్మపల్లి, కొల్లూరు, లింగన్నపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పున్నంచంద్, నాయకులు దశాంత్‌కుమార్, శ్రీశైలం, సమ్మయ్య పాల్గొన్నారు.

కన్నెపల్లి: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఓట్లు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లం తిరుపతి పేర్కొన్నారు. గురువారం మండలంలో నిసుర్జాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు రామన్న యాదవ్, కమల, పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని తవక్కల్‌పాఠశాలల అధినేత అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. గురువారం రామకృష్ణపూర్‌లో తవక్కల్ పాఠశాలల అధినేత అబ్దుల్ అజీజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు రాజు, రఘునాథ్‌రెడ్డి, గాండ్ల సమ్మయ్య, రాజం, సత్యపాల్, ప్రేమలత ఉన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

పోలింగ్ కేంద్రాలను తనిఖీ

భీమిని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ బికర్ణ దాస్, ఎస్సై విజయ్ కుమార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మౌలిక వసతులపై ఆరా తీసారు.

చెత్త తరలింపుపై మారని అధికారుల తీరు

మళ్లీ చెత్తవాహనాలను అడ్డుకున్న స్థానికులు

కాసిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి మున్సిపాలిటీలో జమ చేసిన చెత్తను కాసిపేట మండలానికి తరలిస్తున్న చెత్త వాహనాలను గురువారం స్థానికులు అడ్డుకున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం చెత్త వాహనాలతో మున్సిపల్ సిబ్బంది సోమగూడెం వైపు రావడంతో దుబ్బగూడెం, పెద్దనపల్లినాయకపుగూడకు చెందిన యువకులు దుబ్బగూడెం టోల్‌గేట్ వద్ద అడ్డుకుని నిరసన తెలిపారు. గత వారం రోజులుగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో జమచేసిన చెత్తను సోమగూడెం 1వ గని సమీంపలో పడేయడానికి రావడంతో స్థానికులు చెత్త వాహనాల ను అడ్డుకుని ఆందోళనలు చేపట్టారు. అయినాప్పటికీ మున్సిపాలిటీ అధికారుల తీరులో ఎలాంటి మార్పు లేకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లిలోని చెత్తను కాసిపేట మండలంలో పడేసి మండలాన్ని డంపింగ్‌యార్డుగా మారుస్తారా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా చెత్త వాహనాలను అడ్డుకుని నిరసన తెలుపుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధి కారుల ఆదేశాల తోనే కాసిపేటలో చెత్తను పడేస్తున్నామని చెప్పడం బాధకర మని స్థానికులు పేర్కొన్నారు. చెత్త వ్యర్థాల ద్వారా దుర్గంధం వస్తుందని, ప్రజలు రోగాల బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని మున్సిపల్ సిబ్బందిని నిలదీశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది చెత్త వాహనాలను వెనక్కి తీసుకువెళ్లడంతో ఆందోళనలు విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకపుగూడ యువకులు చెండె నవీన్, శ్రీనివాస్, రెడ్డి సది, మహేష్, స్థానికులు పాల్గొన్నారు.



చెత్త వాహనాలను అడ్డుకుంటున్న స్థానికులు

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

లక్షెట్టిపేట రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంత్‌పల్లి గ్రామానికి చెందిన నస్పూరి గౌరయ్య(49) అనే వ్యక్తి గురువారం తన ఇంటి ఆవరణలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై సతీష్ తెలిపారు. గౌరయ్య కొన్నేళ్ల క్రితం బదుకుదెరువు కోసం ముంబై వెళ్లి తిరిగి వచ్చాడు. సుమారు 5 లక్షల వరకు అప్పు చేసి కూతురు వివాహం చేయడంతో పాటు ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. చేసిన అప్పు ఎలా తీర్చాలో అని మధనపడేవాడు.

చేసిన అప్పు తీర్చే మార్గం కానరాక మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గౌరయ్య భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

పెళ్లి ఇంట విషాదం..

వరుడి మేనత్త మృతితో ఆగిన పెళ్లి

భీమిని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వివాహం జరుగాల్సిన ఇంట్లో విషాదం నెలకొన్న సంఘటన భీమిని మండలంలోని వీగాం గ్రామంలో చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో వరుడి మేనత్త మృతి చెందడంతో పెండ్లి బాజా మోగాల్సిన కుటుంబంలో చావు డప్పు మోగిన విషాద సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వీగాం గ్రామానికి చెందిన కర్రె రాజు (50) బుధవారం రాత్రి హాజీపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వీగాం గ్రామానికి చెందిన వరుడు బైరి బీరేష్‌కు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన రక్షిత అనే యువతితో గురువారం వీగాం గ్రామంలో వివాహం జరుగాల్సింది. ఇక్కడి ఆచారం ప్రకారం వరుడి ఇంట్లో వివాహం జరుపుతారు. వరుడి మేనత్త కర్రె రాజు తన బంధువులతో కలిసి ఆనందంగా వధువును వీగాం గ్రా మానికి తీసుకొని వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో హాజీపూర్ వద్ద లారీ ఢీకొట్టడంతో వరుడి మేనత్త రాజు తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. వధువుతో పాటూ అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలై చికిత్స పొందుతున్నారు. మేనత్త మృతి చెందడంతో గురువారం జరుగాల్సిన వివాహం ఆగిపోయింది. మృతురాలికి భర్త మల్లయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

ఆసుపత్రి సేవలపై జాతీయ ఆరోగ్య మిషన్ ఆరా

బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం ఎన్‌హెచ్‌ఎం జాతీయ ఆరోగ్య మిషన్ బృందం వైద్యులు రమణ, శ్రీనివాస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను ఆసుపత్రి వైద్యులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సమస్యల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యం పనితీరు ఏ విధంగా ఉందని, ఎటువంటి ఫలితాలు వస్తున్నాయని, ఎలా రోగులతో మమేకం అవుతున్నారని ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కోటేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమారి, డిప్యూటి డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాస్, డీపీవో ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.



బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఆసుపత్రి వైద్యులు

సంక్షిప్త సమాచారం

గర్మిళ్ల : భూపాలపల్లిలో నాగవల్లి రాజలింగమూర్తిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ జన సమితి నాయకులు పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలో వారు మా ట్లాడుతూ గతంలో ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్‌పై కోర్టులో కేసు వేసిన విషయం అందరికి తెలిసిందేనన్నారు. హత్యకు ఈ విషయంలో ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : 2023-24 సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి ధాన్యం కొనుగోలు ఏజెన్సీలకు సొసైటి కమీషన్, 1శాతం మార్కెట్ ఫీ చెల్లించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీఆర్‌డీవో కిసన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి ధాన్యం కొనుగోలు ఏజెన్సీలకు సొసైటి కమీషన్ అందించారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యక్త సుందిళ్ల రమేష్ హాజరై విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా భయం వీడేందుకు పలు సలహాలు సూచనలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మన్‌రావు, అధ్యాపకులు బుర్ర అశోక్‌గౌడ్, అరవింద్, పాల్గొన్నారు.

భీమిని : పోడు భూముల్లో సాగు చేస్తున్న ప్రతీ ఒక్కరికీ పట్టాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేసారు. గురువారం మండలంలోని అక్కలపల్లి గ్రామంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ అధ్యక్షుడు దుర్గం ఓంకార్, రాజేష్ మల్లయ్య, బాపు, బక్కయ్య, భీమయ్య, పోశం ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్ : 5 నుంచి 9వ తరగతి వరకు తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 23న అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని బెల్లంపల్లి గురుకుల ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.



పోలీసుల తనిఖీలు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో మండలంలోని భూపాలపట్నం, కేశవపట్నం, భూపాలపల్లి, చీలపల్లి తదితర గ్రామాలతో పాటు సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహ దారి కల్వర్టులపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

చెత్తాచెదారం తొలగింపు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సిబ్బంది చెత్తాచెదారం తొలగించారు. రానున్న రంజాన్ నెలను పురస్కరించుకుని మసీదుల వద్ద, కాలనీల్లో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈవో తిరుపతి సిబ్బంది పారిశు. ధ్య పనులు చేపట్టారు.

బీజేపీని ఆదరించాలి

బెజ్జూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామంలో గురువారం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున స్థానిక నాయకులు ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీ అభ్యర్థికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వసీఖాన్, సంతోష్, కిష్టయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

వాంకిడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలల సంరక్షణ అధికారి మహేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఎలాంటి సమ్య ఉన్నా 1098 సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రశేఖర్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్, పితాంబర్, వెంకటేశ్వర్లు తదితరుల పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తిర్యాణి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం గోయగాం గ్రామానికి చెందిన అంకతి రాజక్క(53) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాజక్కకు కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో వ నాలుగు రోజుల కిందట పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. రాజక్క భర్త రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన

వాంకిడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైత్‌పూర్, బోర్ద పాఠశాలల్లో గురువారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ రవిదాస్ మాట్లాడుతూ క్షయవ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, వ్యాధిగ్రస్తులు ఉన్న వీరికి రెండు వారాలు మించి దగ్గు ఉండి ఆకలి మందగించి బరువు తగ్గడం జరుగుతుందన్నారు. రాత్రిళ్లు చెమట పట్టి జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఆశా లేదా ఏఎన్ఎంకు చెప్పాలని ప్రభుత్వ ఆసుపత్రికి రావాల న్నారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు ఉన్నా వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భగవన్‌దాస్, శరణ్య, ఉపాధ్యాయుడు వినోద్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం న్యాయం చేయాలి
నిర్మల, అంగన్‌వాడీ టీచర్

ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. మెయిన్ అంగన్‌వాడీ టీచర్లకు అందించిన ప్రకారం వేతనాలు అందించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలను నియమించి పని భారం తగ్గించాలి. జిల్లాలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసినట్లు తెలుస్తున్నప్పటికీ వేతనం పాత వేతనం రూ.7800 మాత్రమే వస్తుంది. మాకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

బాధ్యతలు పెరిగినా..
వేతనాలు పాతవే

- నిరాశలో ఉన్నతీకరించిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు
- జిల్లాలో 139 కేంద్రాలు అప్‌గ్రేడ్
- ఆయాలను నియమించక పోవడంతో ఇబ్బందులు

ప్రభుత్వం ఉన్నతీకరించిన 139 కేంద్రాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు బాధ్యతలు పెరిగినా వేతనం పెంపు లేక పోవడంతో నిరాశ చెందుతున్నారు. కొన్ని చోట్ల ఆయాలను సైతం నియమించక పోవడంతో పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు.

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయి. గూడాల్లో, చిన్నచిన్న గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట ప్రభుత్వం ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్(ఉన్నతీకరిస్తూ) చేస్తూ గతేడాది జనవరిలో నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం సూచించింది.

ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ గ్రామాలకు ఆవాసాలు దూరంగా ఉండడంతో పాటు జనాభా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించాలని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటి పరిధిలో జనాభా పెరిగింది. దీంతో అప్‌గ్రేడ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులకు అందించే వేతనాల చెల్లింపుల్లో మాత్రం స్థాయి పెరగడం లేదని వారు వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 937 అంగన్‌వాడీలు కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 139 కేంద్రాలను అప్‌గ్రేడ్ చేశారు. అందులో పని చేసే సిబ్బందికి పని భారం పెంచినా జీతం మాత్రం పెరుగలేదు. దీంతో వారు నిరాశ చెందుతున్నారు.

మినీ అంగన్‌వాడీ టీచర్లకు..

మినీ అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.7,800 వేతనం చెల్లిస్తున్నారు. అప్‌గ్రేడ్ అయిన ఉపాధ్యాయులకు రూ.13,650 చెల్లించాల్సి ఉంటుంది. కానీ గతేడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి, మే నెలల్లో మాత్రమే వేతనాలు పెంచి చెల్లించారు. మిగితా నెలల్లో మాత్రం రూ.7,800 చొప్పున ఇచ్చారు. కేంద్రాల స్థాయి పెరిగినా వేతనాలు మాత్రం పాతవే చెల్లించడంపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసినా కేంద్ర ప్రభుత్వం సంబంధిత వెబ్ సైట్‌ల వేతనాల చెల్లింపుల సమాచారం పొందు పరుచలేదు. దీంతో జాప్యం జరుగుతుందని సమాచారం. ఈ మేరకు సంబంధిత అధికారులు పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరిగతిన చర్యలు చేపట్టి సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, గ్రామీణాభివృద్ధి అధికారి దత్తు ప్రసాద్, డీపీవో భిక్షపతిలతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, ఈజీఎస్ అధికారులతో సాగు, తాగునీరుపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో గామనియల్

రెబ్బెన, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గామనియల్ అన్నారు. గురువారం రెబ్బెన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షలు అంటే భయం లేకుండా చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి, చరణ్‌దాస్, పాల్గొన్నారు.

కూరలో పురుగు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ మెస్‌లో గురువారం కౌటాలకు చెందిన ఓ వ్యక్తి భోజనం చేస్తుండగా కూరలో పురుగు వచ్చింది. దీంతో ఈ విషయాన్ని హోటల్ సిబ్బందికి చెప్పాడు. మళ్లీ కూరవేస్తామని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని ఈ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని సంబంధిత వ్యక్తి సోషల్ మీడియాతో పాటు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై సంబంధిత మెస్ యాజమానిని వివరణ కోరగా వంకాయ కూరలో పురుగు వచ్చింది నిజమేనని తెలిపారు.



కూరలో వచ్చిన పురుగు

అభివృద్ధి చేస్తున్నాం.. ఆదరించండి..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్సీ విఠల్, మాజీ మంత్రి వేణుగోపాలచారి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేస్తున్నామని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కాగజ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కుమరం భీం ప్రాజెక్టుతో పాటు జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కంటోన్మెంటు ఎమ్మెల్యే శ్రీగణేశ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, మాజీ ఎంపీ బాపురావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవళిరెడ్డి మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, అర్షద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

- జన్నారం, (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నిర్వహించిన పట్టభద్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరు పతి, గ్రంథాలయ చైర్మన్ రియాజ్, నాయకులు ఆలీఖాన్, ఆత్రం సుగుణ పాల్గొన్నారు

మంత్రికి వినతుల వెల్లువ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌కు వచ్చిన మంత్రి సీతక్కకు గురువారం ఆయా సంఘాల నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ప్రైవేటు డిగ్రీ కళాశాల సంఘ సభ్యులు కళాశాలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంటు ఇంత వరకు విడుదల కావడం లేదని చెప్పారు. దీంతో కళాశాలల నిర్వహణ చాలా కష్టంగా ఉందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు విద్యా సంస్థలకు సెలవు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించే సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని శనివారం విద్యా సంస్థలకు సాధారణ సెలవు దినంగా ప్రకటించామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు వర్తిస్తుందని, దీనికి బదులుగా ఏప్రిల్ 2న వచ్చే రెండో శనివారం కొనసాగుతాయని పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నా ఐకేపీ సిబ్బంది

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దహెగాం ఐకేపీ ఏపీవో రాజ్‌కుమార్‌పై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏపీఎంపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధన్‌రాజ్, సంతోష్, తిరుపతి, వనిత, అన్నపూర్ణ, సుమలత, రోజ, రమ, మహేశ్వరి, అంకన్న, స్వప్న, స్వాతి, వెంకటేష్, భరత్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కెరమెరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. గురువారం ఆమె మండలంలోని రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను వార్షిక పరీక్షలకు ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని సూచించారు. పరీక్షలు అంటే భయం లేకుండా చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువాలని సూచించారు. ఆమె వెంట హెచ్ఎం ప్రేమ్‌దాస్ ఉన్నారు.

విద్యార్థులు సమయం వృధా చేయకూడదు

జైనూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున సమయం వృధా చేయవద్దని డీటీడీవో రమాదేవి అన్నారు. రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో సమయాన్ని వృధా చేయకూడదని సూచించారు. గత పబ్లిక్ పరీక్షలో ఈ పాఠశాల నుంచి ఫలితాలు ఆశాజనకంగా వచ్చాయని చెప్పారు. వాటిని దృష్టిలో పెట్టుకుని పట్టుదలతో చదువు కోవాలని సూచించారు. కార్యక్ర మంలో పాఠశాల హెచ్ఎం అనిత, వార్డెన్ గణపత్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

తిర్యాణి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే యువతకు 55 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని టీపీసీసీ కార్యదర్శి రవళిరెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నేపథ్యంలో గురువారం తిర్యాణి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో వెంకన్న, గౌరయ్య, రాంచందర్, శ్యాం నాయక్, చందు, మల్లేష్, కుమార్, దినేష్, మహేష్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

దహెగాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా మిషన్ భగీరథ నీరు నిలిచిపోయినా అధికారులు సమస్య పరిష్కరించడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు రాక పోవడంతో ఇబ్బందులు పడు తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

తగ్గిన చికెన్ అమ్మకాలు

- వెలవెలబోతున్న దుకాణాలు
- ధరలు తగ్గించినా కొనేవారు కరువు
- పెరిగిన చేపలు, మటన్ విక్రయాలు

బెజ్జూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ ప్రభావంతో జిల్లాలో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. జిల్లాలో ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ వైరస్ ఆనవాళ్లు లేకున్నా ఇతర జిల్లాల్లో వైరస్ వ్యాప్తి కారణంగా చికెన్ తినడం తగ్గించేశారు. ఎక్కువ ఉడికించిన చికెన్ తింటే ఎలాంటి దుష్ప్రభా వాలు ఉండవని అధికారులు చెబుతున్నా.. ఈ పరిస్థితుల్లో తినకపోవడమే మంచిదని చాలామంది భావిస్తున్నారు. దీంతో చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి.

● శుభకార్యాల్లో మటన్‌కు ప్రాధాన్యం

శుభ కార్యాల్లోనూ చికెన్ స్థానంలో మటన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రభావం విషయం వెలుగు చూడక ముందు కిలో చికెన్ ధర 200 రూపాయలు ఉండేది. ప్రస్తుతం 160 రూపాయలకు పడిపోయింది. ధర తగ్గినా ఎవరు కొనడం లేదు. అకస్మాత్తుగా విక్రయాలు తగ్గిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉండడంతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. దుకాణాల అద్దె, కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాలకు ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడ్ల విక్రయాలు సైతం 40 నుంచి 50 శాతం మేర పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు.. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. అయినా ప్రజల్లో భయం తొలగిపోవడం లేదు. ఇక పలు హోటళ్ల, రెస్టారెంట్లలో చికెన్ బిర్యానీ, చికెన్‌తో చేసే ఇతర వంటకాలు తినేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. నాటుకోళ్లు, రొయ్యలు, మటన్, శాకాహార పదార్థాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో నాటుకోళ్ల, మటన్, చేపలు, రొయ్యల రేట్లు పెరుగుతున్నాయి. ఏళ్ల తరబడి చికెన్ విక్రయాలపై ఆధారపడిన తమకు బర్డ్‌ఫ్లూ వైరస్ తీరని నష్టాన్ని కలిగిస్తోందని చికెన్ సెంటర్ల యజమానులు, వాటిలో పని చేసే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బెజ్జూరులో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ సెంటర్

అమ్మకాలు తగ్గాయి..



బర్డ్‌ఫ్లూ వైరస్ వదంతుల కారణంగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. గతంలో రోజుకు క్వింటాలు వరకు చికెన్ అమ్మేవాళ్లం. ఎన్నో ఏళ్లుగా చికెన్ సెంటర్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాం. ఈ ప్రాంతంలో వైరస్ ప్రభావం లేకున్నా ప్రచారం అధికంగా ఉండడంతో ప్రజలు చికెన్ కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడం లేదు.

- మేరాజ్, చికెన్ సెంటర్ యజమాని